క్లుప్తంగా

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం



బాధితురాలికి ఆర్థికసాయం అందజేస్తున్న దాత

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ బాధితురాలికి దాత పార్థసారథి నాయుడు ఆర్థికసాయం అందజేశారు. చిత్తూరు నగరం వీరభద్రకాలనీకి చెందిన రోషిణి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలిసి ఆదివారం దాత రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. రోషిణి గత కొంతకాలంగా తిరుపతిలోని స్విమ్స్‌లో డయాలసిస్ చేయించుకుంటోంది. ఈ కారణంగా వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతోంది. కుటుంబం గడవడం కూడా కష్టం మారిందని తెలుసుకున్న పార్థసారథినాయుడు ఆర్థికసాయం అందించారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే కార్యక్రమంలో మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా జగదీష్



ఎన్నికైన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (1947) నూతన జిల్లా అధ్యక్షుడిగా జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం స్థానిక జైహింద్ పాఠశాలలో నిర్వహించారు. ఆ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ (జీడీ నెల్లూరు), జిల్లా ఉపాధ్యక్షులుగా నవీన్, అఫ్జల్ భాషా, లక్ష్మిపతి, హేమలత, కార్యదర్శులుగా వేణు, సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, హమీద్, శ్రీనివాసులు, ఆడిట్ కన్వీనర్‌గా కృష్ణమూర్తి, సభ్యులుగా లక్ష్మిపతి, వాసుదేవయ్య, జగన్నాథరెడ్డి, వెంకటేశులు, కార్యవర్గ సభ్యులుగా బాలు, ఉదయ్‌కుమార్ , షఫీన్నిసా, బాలయ్య ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ముక్తార్ అహ్మద్, గౌరవ సలహాదారులుగా గోపినాథ్, ప్రకాష్‌ను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు.

సమాచార జ్ఞాపిక.. కనిపించదా ఇక !

- శతాబ్దం పాటు సేవలు అందిస్తున్న పోస్టు బాక్స్ కనుమరుగు కానున్నట్లు సోషల్ మీడియాలో వైరల్
- సమాచార వ్యవస్థలో పలు మార్పులకు శ్రీకారం చుట్టిన పోస్టల్ శాఖ
- రిజిస్టర్డ్ పోస్టును ఇకపై స్పీడ్‌పోస్ట్‌లో విలీనం
- సోషల్ మీడియాలో వచ్చేవన్నీ వదంతులే అంటున్న ఆ శాఖ ఉన్నతాధికారి



తపాలాబాక్స్



రిజిస్టర్డ్ పోస్టు



స్పీడుపోస్టు

చిత్తూరు కార్పొరేషన్: అందుబాటులో ఉన్న టెక్నాలజీకి అనుగుణంగా మార్పులు సహజం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందే సేవలకు సంబంధించి వాటి నిర్వహణ, ఆదాయ, వ్యయాలను దృష్టిలో పెట్టుకుని మార్పులు తీసుకువస్తున్నాయి. అయితే గత కొద్ది రోజులుగా తపాలాశాఖ సేవలకు సంబంధించి సోషల్ మీడియాలో పలు వదంతులు వైరల్ అవుతున్నాయి. వాటిని ఆ శాఖ అధికారులు ఖండించిన సందర్భాలు కూడా లేవు. దీంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అక్టోబర్ 1 నుంచి రిజిస్టర్ పోస్ట్ సేవలను నిలిపివేయనున్నట్లు, పోస్ట్‌బాక్స్‌లను ఎత్తివేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ప్రధానాంశం.

పురాతన సమాచార వ్యవస్థ

ఇప్పుడైతే వాట్సాప్, 5జీ, నెట్ అంటూ సమాచార వ్యవస్థ కొత్త పుంతలు తొక్కింది. కానీ ఇవేవీ లేనప్పుడు మంచి, చెడు వార్తలను చేరవేసే ఏకైక సమాచార వ్యవస్థ తపాలానే. 1854లో అప్పటి బ్రిటిషర్ లార్డ్ డల్హౌసీ ప్రవేశపెట్టిన ఇండియా పోస్టాఫీస్ చట్టంతో సేవలు ఆరంభమయ్యాయి. అంతకు ముందు 1766లో వారెన్ హేస్టింగ్స్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధ్వర్యంలో కంపెనీ మెయిల్ మొదలైంది. దాదాపు 171 ఏళ్లుగా ముఖ్యమైన పత్రాలను, వస్తువులను సురక్షితంగా నమ్మకంగా పంపించడానికి రిజిస్టర్డ్ పోస్ట్ ప్రధాన మార్గంగా నిలిచింది. లీగల్‌నోటీసులు, అపాయింట్‌మెంట్ లెటర్లు, బ్యాంకింగ్ ఇతర పత్రాలు వంటి వాటిని పంపడానికి వీటిని ఎక్కువగా ఉపయోగించేవారు. పంపిన వస్తువు అవతలి వారికి చేరినట్లు రశీదు (డెలివరీ ప్రూఫ్) పొందడం ఒక ప్రత్యేకత. చట్టపరంగానూ చెల్లుబాటు అవుతుంది. ఇవి కనుమరుగు కానున్నాయని సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతుండడంతో ప్రజల్లో కాస్త గందరగోళం నెలకొంది.

స్పీడ్‌పోస్ట్‌లో విలీనమా !

అక్టోబర్ 1 నుంచి రిజిస్టర్ పోస్ట్ సేవలను నిలిపివేయనున్నట్లు తపాలాశాఖ ప్రకటించింది. ఇప్పటికే పోస్టుమాస్టర్లకు శాఖాపరమైన నోటీసులు ఇచ్చారు. ఈ సేవలను స్పీడ్‌పోస్ట్ సేవలో విలీనం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పలు సేవల అప్‌డేట్‌లో భాగంగా రిజిస్టర్ పోస్ట్‌ను స్పీడ్‌పోస్ట్‌లో విలీనం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. స్పీడ్ పోస్టు అంటే వేగవంతంగా సమాచారం చేరవేసే విభాగం . అయితే అందుకు తగ్గినట్లే రుసుం సైతం చెల్లించాలి. ఇప్పుడు రిజిస్టర్డ్ పోస్టు సేవలు స్పీడ్‌పోస్టులో కలపడంతో లెటర్ డెలివరీలు కూడా పెరుగుతాయి. వీటికి ఆన్‌లైన్ ట్రాకింగ్ విధానం కూడా అందుబాటులో ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో డిజిటల్ సేవల వాడకం పెరిగింది. సమాచారాలను మెయిల్ ద్వారా జరుపుతున్నారు. గత ఐదేళ్లుగా దాదాపు 30 శాతం వరకు రిజిస్టర్డ్ పోస్ట్ బుకింగ్ తగ్గినట్లు తెలుస్తోంది. వీటికి తోడు కొరియర్ సేవలకు ఆదరణ పెరిగింది. రిజిస్టర్డ్ పోస్ట్ కనీసం చార్జ్ రూ.26 నుంచి రూ.30 వరకు ఉండగా స్పీడ్‌పోస్ట్ రూ.41 ఉంది. అంటే ప్రారంభ చార్జీలోనే రమారమి రూ.16 వరకు ఎక్కువ భారం పెట్టక తప్పదు.

పోస్ట్‌బాక్స్‌లను ఎత్తివేస్తారా..?

రిజిస్టర్డ్ పోస్టు సేవల రద్దు నేపథ్యంలో సంవత్సరాల చరిత్ర ఉన్న పోస్టుబాక్స్‌లను ఎత్తి వేస్తారని ప్రచారం జోరుగా జరుగుతోంది. దీంతో పోస్టల్ అభిమానులు కలత చెందారు. ఎన్నో ఏళ్లుగా సేవలు అందించిన నేస్తం ఇక కనుమరుగు కానుందనే ప్రచారంపై ఒకింత బాధ పడుతున్నారు. అయితే ఇందులో ఎలాంటి వాస్తవం లేదని, అది ఒక ఊహాగానమేనని మాత్రమే అని పోస్టల్ వర్గాలు అంటున్నాయి. దీనిపై ఎటువంటి అధికారిక ప్రకటన లేదని వెల్లడిస్తున్నారు.

అవన్నీ పుకార్లే..!

తపాలాశాఖపై వస్తున్న వార్తలన్నీ పుకార్లే. రిజిస్టర్డ్ పోస్టు సేవలను అక్టోబర్ 1 నుంచి స్పీడ్‌పోస్టులో విలీనం చేస్తున్నారు. తొలుత సెప్టెంబర్ 1 నుంచి వీటిని అమలు చేయాలనుకున్నా.. సాంకేతిక కారణాలతో నెలరోజులు గడువును పొడగించారు. అదేవిధంగా పోస్ట్‌బాక్స్‌లను ఎత్తివేస్తున్నట్లు వస్తున్న వదంతులు నమ్మకండి. అవి అలానే కొనసాగుతాయి. వీటిపై ఎటువంటి అధికారిక ప్రకటన లేదు.

– లక్ష్మణ్, సూపరింటెండెంట్, తపాలాశాఖ

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో విరివిగా వర్షాలు కురుస్తుండడంతో దోమల నివారణకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తరకం దోమలతో పలురకాల జ్వరాలు వస్తున్నాయని తెలిపారు. జిల్లాలో గ్రామీణ స్థాయిలో పీహెచ్‌సీల్లో సరైన వైద్య సేవలు అందడం లేదని విమర్శించారు. కొంతమంది మెడికల్ ఆఫీసర్లు వారి సొంత పనుల్లో ఉన్నారని ఆరోపించారు. ఆశా వర్కర్లను వైద్య సేవలకు కాకుండా ఇతర పనులకు వాడుకోవడం తప్పన్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. అక్కడ అవసరం లేకపోయిన రకరకాల టెస్టులు పేరుతో వేలు దోచుకుంటున్నారని తెలిపారు. కలెక్టర్ ఉన్నతాధికారులతో సమీక్షలు చేస్తున్నప్పటికీ వైద్యాధికారులు పనితీరు బాగలేదన్నారు. రోగులకు చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇచ్చి పరిశుభ్రత విషయంలో దృష్టి పెట్టాలన్నారు. దోమల నివారణకు చేపట్టాల్సిన మందులు సరఫరా చేసి పిచికారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జ్యోతిరావు, అయ్యప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా దుర్యోధన వధ ఘట్టం



గాజులపల్లెలో దుర్యోధన వధ ఘట్టాన్ని తిలకించడానికి విచ్చేసిన జనసందోహం



దుర్యోధన వధ ఘట్టంలో తలపడుతున్న దుర్యోధన, భీముడి పాత్రధారులు

తవణంపల్లె: మండలంలోని గాజులపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 18 రోజుల పాటు భక్తిభావంతో నిర్వహించిన మహాభారత యజ్ఞం ముగిసింది. ఆదివారం దుర్యోధన వధ ఘట్టం అద్భుతంగా ప్రదర్శించారు. గాజులపల్లెలో ఈ నెల 15వ తేదీన మహాభారత యజ్ఞం ప్రారంభమైంది. భాగవతార్ ఉషారాణి హరికథను ఆలపించారు. శనివారం ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, పోతురాజు అభిషేకం, పూజలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ నుంచి రాత్రి నాటకం నిర్వహించారు. మడుగులో దాక్కున్న దుర్యోధనున్ని భీముడి వేషధారి బయటకు లాక్కుని వచ్చి వధించే ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. ఈ ఘట్టాన్ని తిలకించడానికి గాజులపల్లె పరిసరాల నుంచి ప్రజలు భారీగా విచ్చేశారు.

స్వామికి గొడుగుల వితరణ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి గ్రామోత్సవానికి ఆదివారం ఓ దాత గొడుగులు వితరణ చేశారు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లికి చెందిన కుమార్ స్వామినాయుడు ఆరుగొడుగులకు ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. అనంతరం ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నయనా'నృత్య'కరం



నృత్యం అభినయిస్తున్న కళాకారులు



కాణిపాకం: ఉత్సవాల్లో భాగంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన మండపంలో శనివారం కూడా సాంస్కృతిక కార్యక్రమాలు భళా అనిపించాయి. తమదైన ప్రదర్శనలతో ఆహుతులను మెప్పించారు. కూచిపూడి, భరతనాట్యంతో సంభ్రమాశ్చర్యంలో ముంచెత్తారు. ఉదయం ధార్మిక ఉపన్యాసం ఇచ్చారు. భక్తిగీతాలతో భక్తులను అలరించారు. అలాగే భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. పౌరాణిక నాటక ప్రదర్శన, కోలాటాలు, భజనలతో మండపం నృత్యశోభను సంతరించుకుంది. చప్పట్లతో కళాకారులను భక్తులు, అధికారులు హర్షధ్వానాల వర్షం కురిపించారు. అధికారులు ప్రశంసాపత్రంలో కళాకారులను అభినందించారు.

కరణం విమలకు తెలుగుతేజం జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కరణం విమల

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటకు చెందిన ప్రముఖ రచయిత్రి కరణం విమలకు శ్రీశ్రీ కళావేదిక తెలుగు తేజం పురస్కారాన్ని అందించింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను వేదిక సభ్యులు ఈ పురస్కారం ప్రదానం చేశారు. అలాగే చిత్తూరుకు చెందిన కరణం శివప్రసాద్, కరణం గిరిబాబు, జగన్నాథం, గణేష్, మునిదాసరి తదితరులు పురస్కారం అందుకున్నారు.

కనుల పండువగా శతకలశాభిషేకం

కాణిపాకం: బ్రహ్మోత్సవాన్ని పురస్కరించుకుని కాణిపాకంలో ఆదివారం శత కలశాభిషేక మహోత్సవ ఊరేగింపును కనుల పండువగా నిర్వహించారు. ముందుగా శివాలయంలో సంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు పరివట్టం కట్టి కలశాన్ని తలపై ధరింపజేశారు. అనంతరం కలశాలతో ఆలయ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కల్యాణ వేదిక వద్దకు చేరుకున్న కలశాలతో ఆలయ పండితులు సిద్ధి, బుద్ధి సమేత శ్రీ విఘ్నేశ్వరుడి ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తేనె, నెయ్యి, పాలు, పెరుగు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించారు.

వినాయక.. సెలవిక..

- గ్రామాల్లో అట్టహాసంగా గణేష్ నిమజ్జనోత్సవం
- కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటూ వేడుకగా ఊరేగింపు
- ఐదురోజుల పాటు ఘనంగా పూజలు అందుకున్న గణనాథుడు



ఉత్సాహంగా ఉట్టి కొడుతున్న యువత



అరగొండలో గణేశుడి ప్రతిమను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

తవణంపల్లె: వినాయక చవితి నాడు కొలువుదీరిన గణనాథుడు ఐదురోజుల పాటు పూజలందుకుని ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లాడు. మండలవ్యాప్తంగా గ్రామాల్లో గణేశుడి విగ్రహాలను వైభవంగా ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అరగొండ, దిగువమోదలపల్లెలో యువకులు కేరింతలు వేస్తూ రంగులు చల్లుకుంటూ ఉట్లోత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలకేంద్రం బంగారుపాళెంతో పాటు మొగిలి, తగ్గువారిపల్లె, ఇందిరమ్మకాలనీ, పాలేరు, పెరుమాళ్లపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. యువకులు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపారు. అనంతరం వినాయకుడి ప్రతిమలను మేళతాళాలు, బాణసంచా వేడుకల మధ్య నిమజ్జనానికి తరలించారు.

పూతలపట్టులో..

పూతలపట్టు(యాదమరి): పూతలపట్టు మండలవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం అట్టహాసంగా నిర్వహించారు. మండల పరిధిలోని అమ్మేపల్లిలో గణనాథున్ని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మేళతాలాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.



దిగువ మోదలపల్లెలో..



బంగారుపాళెం: మొగిలిలో నిమజ్జనానికి తరలుతున్న విఘ్నేశ్వరుడు



